

శిక్షణకు వెళ్లే అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు
టిఎ, డిఎ చెల్లించాలి

ప్రజాశక్తి- పెదబయలు : నూతన విద్యావిధానంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు విశాఖలో నిర్వహించే శిక్షణకు వెళుతున్న గురుకులం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు రవాణా, శిక్షణ భృతి చెల్లించాలని కోరుతున్నారు. విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు ఇంట్రాక్టివ్ ప్లాట్‌ప్యానెల్ (ఐఎఫ్‌టి) శిక్షణ ఇవ్వనున్నారని, ఈ మేరకు ఉపాధ్యాయలంతా విశాఖ వెళ్లి శిక్షణ పొందాలని సూచించారన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 16 వరకు విడతల వారీగా శిక్షణలో పాల్గొనే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో గురుకులాల్లో పనిచేస్తున్నారని, రెండు రోజుల శిక్షణకు సొంత ఖర్చులతో వెళ్లి రావడం, శిక్షణకు అక్కడ ఉండడం వ్యయాభారంతో కూడిన వ్యవహారం కావడంతో వారంతా ఆందోళన, ఆవేదన చెందుతున్నారు. శిక్షణకు వెళ్లే గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు టిఎ, డిఎలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

గ్రేడ్ -2 హెచ్‌ఎం బదిలీ ఓ మాయాజాలం
అక్రమ బదిలీలను రద్దు చేయాలి
ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత అప్పలనర్స, పక్కనే సురేంద్ర

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎలో గిరిజన సంక్షేమ గ్రేడ్-టూ హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ ఓ మాయాజాలంలా ఉందని, ఈ అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనర్స, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ అక్రమ బదిలీల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు, ఐటిడిఎ పిఒ, గిరిజన సంక్షేమ డిడిలకు ఫిర్యాదు చేశారు. బదిలీల నిషేధం అమలులో ఉన్నప్పటికీ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నచ్చిన వారికి నచ్చిన చోటుకు, నచ్చిన సమయంలో అడ్డగోలుగా పోస్టింగులు ఇచ్చారని ఆరోపించారు. బదిలీల సమాచారం ఇచ్చేందుకు డిడి కార్యాలయం అధికారులు వెనకంజ వేస్తున్న తీరు సైతం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. మే 22 నుంచి 30 తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా టిడబ్ల్యూ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరిగింద,. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి చేశారన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ఒకే చోట రెండేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులు రిక్వెస్ట్ ప్రాతిపదికన బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొందన్నారు. మే 30న ఐటిడిఎ సమావేశ మందిరంలో టీడబ్ల్యూ హెచ్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్ డిడి ఐ.కొండలరావు, కార్యాలయ సిబ్బంది ఉపాధ్యాయ సంఘాలనేతల సమక్షంలో నిర్వహించారన్నారు. ఐదుగురు హెచ్‌ఎంలు కౌన్సెలింగ్‌కు హాజరైనప్పటికీ కోరుకోకుండానే వెళ్లిపోయారన్నారు.

అయితే మే నెల 30న బదిలీలు ముగియడంతోపాటు అర్ధరాత్రి నుంచే బదిలీల నిషేధం అమలులో ఉన్నప్పటికీ నియంతత్వ ధోరణితో జూలై నెల మొదటి వారంలో ఆ ఐదుగురు హెచ్‌ఎంలకు తాటిపర్తి, హుకుంపేట, పెదబయలు, జికె.వీధి, భీంపోలు పాఠశాలలకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంతో ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం సష్టించిందన్నారు. ఆ ఐదుగురు బదిలీల తంతుపై ఉపాధ్యాయుల్లో చర్చ సాగుతోందన్నారు. టిడబ్ల్యూ విద్యాశాఖలోని ఓ ఉన్నతాధికారితో పాటు జిల్లాలోని ఉన్నతాధికారి సిఫారసుతోనే ఆ ఐదుగురు హెచ్‌ఎంలకు నిబంధనలకు పూర్తి విరుద్ధంగా బదిలీ ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలుస్తోందన్నారు. సిఫారసు బదిలీల్లో డిడి కార్యాలయంలో పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారిందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయన్నారు. బరితెగించి ఇచ్చిన అడ్డగోలు బదిలీ ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ ఐదుగురు హెచ్‌ఎంల బదిలీ వెనక జరిగిన అక్రమ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ అడ్డగోలు బదిలీల వ్యవహారంలో టిడబ్ల్యూ టీచర్స్ యూనియన్ తో పాటు ఇతర టీచర్స్ యునియన్ నాయకులు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. జిఒ3 కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వంపై తమ గిరిజన సంఘం ఒత్తిడి మేరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ స్వీకరించిన అనంతర ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయకుండానే, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న వారిని మైదానానికి, మైదానం ప్రాంతం నుండి ఏజెన్సీ ప్రాంతానికి టీచర్లను బదిలీ చేయడం, నియమించడం ఆదివాసీల హక్కుల, చట్టాల పై తీవ్రమైన ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులకు అశనిపాతం!

- గడువు, సర్వీసు నిబంధనతో అనేక మంది రెగ్యులరైజేషన్‌కు దూరం
- ప్రభుత్వ ప్రకటనపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు వైద్య ఉద్యోగులు (ఫైల్)

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఏజెన్సీలో వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులకు సర్వీస్ క్రమబద్ధీకరణ అందని ద్రాక్షగా మారుతోందనే ఆవేదన వ్యక్తమౌతోంది. ప్రభుత్వ శాఖల్లో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇటీవల ప్రకటించిన ప్రభుత్వం, 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను మాత్రమే రెగ్యులర్ చేస్తామని మెలిక పెట్టింది. దీంతో ఏజెన్సీలో గత పదేళ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న అనేకమంది సర్వీస్ క్రమబద్ధీకరణకు నోచుకోని పరిస్థితి ఎదురయ్యింది. దీంతో ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తూ చదివిస్ క్రమబద్ధీకరణకు జరగదని నిరాశ చెందుతున్నారు.

పాడేరు ఏజెన్సీలోని వైద్యారోగ్య శాఖలో 2002నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు జరిగాయి 2002 డిఎస్‌సిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం 42 మంది గిరిజనేతరులు, మరో 60 మంది గిరిజన అభ్యర్థులు ఎంపిహెచ్‌ఎ (మేల్) ఉద్యోగాలకు ఎంపికయ్యారు వీరంతా 2003లో విధుల్లో చేరారు. రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనలో వీరు మాత్రమే సర్వీస్ క్రమబద్ధీకరణకు నోచుకోనున్నారు. అయితే పాడేరు ఏజెన్సీలో 2012 నుంచి వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల నియమకాలు ఎక్కువ జరిగాయి. ఈ మేరకు 2012లో 29 మంది ఎంపీహెచ్‌ఏలు, 2015లో 52 మంది ఎంపీహెచ్‌ఏ (మేల్), 46 మంది ఎంపిహెచ్‌ఎ (ఫిమేల్) అలాగే ప్రభుత్వ జిల్లా, కమ్యూనిటీ ఆసుపత్రిలో 150 మంది స్టాఫ్ నర్సుల నియామకం జరిగింది. అలాగే 2017లో మరో 13 మంది ఎంపీహెచ్‌ఏ (మేల్) 24 మంది స్టాఫ్ నర్సులు, 33 మంది ఫార్మసిస్టులు కాంట్రాక్ట్ పద్ధతిపై నియమితులయ్యారు ఇదే ఏడాది ప్రభుత్వ జిల్లా ,కమ్యూనిటీ ఆసుపత్రిలో మరో 120 మంది స్టాఫ్ నర్సులు నియమితులయ్యారు. ఈ విధంగా పాడేరు ఏజెన్సీలో వైద్య ఆరోగ్యశాఖ అంతా కాంట్రాక్టు ఉద్యోగులతోనే నిండి ఉంది.

ప్రభుత్వ ప్రకటనతో 400మందికి నిరాశ

2012 నుంచి 2017 వరకు కాంట్రాక్ట్ పద్ధతిపై నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ కొందరికి పదేళ్లు మరికొందరికి ఐదేళ్ల సర్వీసు పూర్తయింది. కానీ 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తికానందున. సుమారు 400 మందికి పైగా ఎంపీహెచ్‌ఏలు, స్టాఫ్ నర్సులు సర్వీస్ క్రమబద్ధీకరణకు నోచుకోని పరిస్థితి ఉంది, ఏజెన్సీ వైద్యారోగ్య శాఖలో ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతూ ఏళ్ల తరబడి తాము అందిస్తున్న సర్వీసును గుర్తించి ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన కాంట్రాక్ట్ మెడికల్ ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఐదేళ్ల సర్వీసున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ఏజెన్సీలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. ,రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వం విధించిన 2014 జూన్ 2 కటాఫ్ తేదీతో 10 శాతం మంది సర్వీసు మాత్రమే క్రమబద్ధీకరణ జరగనుంది. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలి.

శెట్టి నాగరాజు. జిల్లా అధ్యక్షుడు
కాంట్రాక్ట్ గిరిజన వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం. పాడేరు

గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలి


రేంజర్‌కు వినతిపత్రం ఇస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి :గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు సాగు హక్కు పత్రాలు మంజూరు చెయ్యాలని స్థానిక సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు కోరారు. గురువారం ఫారెస్టు రేంజర్ దుర్గప్రసాద్ ను కలసి లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ మండలంలో కొత్తూరు పంచాయతీ కొత్తవలస, ఎన్ఆర్ పురం పంచాయతీ బూరుగ, చినకోనేల, కరకవలస గ్రామాలకు అటవీ పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. పోడుభూములే తప్ప, మరే జీవనాధారం లేని గిరిజన సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. భూహక్కు పత్రాలు లేకపోవడంతో ఉపాధి పనులు లేక, రైతు భరోసా దక్కక గిరిజన రైతులు నష్టపోతున్నారని రేంజర్‌కు విన్నవించారు. తక్షణమే స్పందించి సాగుహక్కు పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. రొంపల్లి పంచాయతీ బూరుగలో 40 కుటుంబాలు, చినకోనేలలో 42 కుటుంబాలు, కరకవలసలో 36 కుటుంబాల గిరిజనులు సాగుహక్కు పట్టాలు దక్కక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, సిపిఎం మండల నేత కాకర. సింగులు, బాధిత గిరిజన రైతులు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి సత్యం బీట్ అధికారులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-కూనవరం

అంగన్వాడీల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే డిమాండ్స్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. గురువారం కూనవరం మండల కేంద్రంలో మడెం అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ వైఎస్.జగన్ ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే వేతనాల కంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాలని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐసిడిఎస్‌ను రక్షించాలని కోరారు. పై డిమాండ్లపై ఈ నెల 10, 11 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద ధర్నాలు జరుగుతున్నాయని, ఇక్కడ చింతూరు, రంపచోడవరం ఐటిడిఎ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ డిమాండ్స్ డే కార్యక్రమాల్లో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు పూనెం సత్యనారాయణ, కొమరం పెంటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రంగమ్మ, నాయకులు సూర్యకుమారి, రాజేశ్వరి, ప్రసన్న, లలిత, నాగమణి, సుజాత, ముత్తమ్మ, లక్ష్మి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని వినతి



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - ఎటపాక

2022 జులై, ఆగస్టు నెలల్లో వచ్చిన గోదావరి వరదలకు ముంపునకు గురైన మండలంలోని గన్నవరం, కాపు గొంపల్లి, రచ్చగొంపల్లి, కృష్ణవరం గ్రామాలను పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని సిపిఐ ఆధ్వర్యంలో ఎటపాక తహశీల్దార్‌కి వినతి పత్రం అందించారు. గురువారం గన్నవరంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్‌కి వినతి అందించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతుతూ గతేడాది వరదల్లో ఆయా గ్రామాలు ముంపునకు గురవ్వడంతో ఇండ్లు, పంట పొలాలు మునిగి పోయాయాని తెలిపారు. ప్రతి ఏటా గోదావరి వరదల వల్ల ఇదే దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నవరం పంచాయితీ, కృష్ణవరం గ్రామాలను పోలవరం ముంపు జాబితాలో చేర్చి, భూప్యాకేజీ, ఇండ్ల ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఎంపిటిసి కంటె రాజు, సిపిఐ మండల కార్యదర్శి ఎలుశాల నాగరాజు, సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, పూస రాఘవలు, మైపా రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రంలో స్విచ్ యార్డ్‌లో శుక్రవారం అత్యవసర మరమ్మతు పనులు చేపడుతున్నామని, దీని వల్ల ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏపీ జెన్కో ఎంఆర్‌టి ఏడిఈ శ్రీకాంత్ వెల్లడించారు. ఈ విషయాన్ని సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న వినియోగదారులు గమనించాలని కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితమే మరమ్మతులు నిర్వహించవలసి ఉందని, అయితే వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా నిలుపుదల చేశామని చెప్పారు. ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం!

- రాత్రి వేళ స్లాబు పెచ్చులూడిన డిగ్రీ కాలేజీ భవనం
- శిథిల గదుల్లోనే బిక్కుబిక్కుమంటూ చదువులు
- తక్షణ మరమ్మతులకు ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్


తరగతి గదిలో పడిన శ్లాబు పెచ్చులు


పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్ఐ ప్రతినిధులు, విద్యార్థులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:

శిథిలావస్థకు చేరుకున్న అరకువేలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. పగటి పూట, తరగతులు జరుగుతున్న సమయంలో కాకుండా రాత్రి వేళలో పెద్దస్థాయిలో శ్లాబు పైకప్పు పెచ్చులు కిందపడగా, పెద్దప్రమాదమే తప్పింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో, శిథిలభవనంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని విద్యార్థులు, అధ్యాపకులు భయపడుతున్నారు. భవనానికి తక్షణమే మరమ్మలు చేపట్టడంతోపాటు కొత్త భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్ఐ నేతలు కోరుతున్నారు.

అరకువేలీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతి లేని పరిస్థితుల్లో పాత భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ఆ భవనాలు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి శ్లాబ్ పైకప్పు నుంచి భారీ పెచ్చులూడి కిందపడ్డాయి. రాత్రి వేళ కావడంతో పెద్దప్రమాదమే తప్పిందని విద్యార్థులు అంటున్నారు. కాగా గతంలోనూ విద్యార్థులున్న సమయంలోనే చిన్నపాటి పెచ్చులు పడడంతో ఒక విద్యార్థి తతకు తీవ్రగాయాలై ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. గురువారం భారీ స్థాయిలో పెచ్చులు పడిన సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

పదేపదే.ఇటువంటి సంఘటనలు పునరావృతమౌతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంపై పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ కళాశాలలో 1500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, నేతలు, సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, పెచ్చులూడి ప్రాణనష్టం సంభవించకుండా వెంటనే స్పందించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ కిల్లో ధనలక్ష్మి, ఎస్‌ఎఫ్ఐ ఉపాధ్యక్షులు కాకరి కొండమ్మ, మండల కమిటీ సభ్యులు సోడాపలి ఐసుబాబు, వంతల బలరాం తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు, హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

'ఏకలవ్య'లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

- భోజనం, వసతి కల్పించకపోవడంతో ఇబ్బంది పడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి- రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని ఏకలవ్య పాఠశాలలు/ కళాశాలల్లో 6, 7 తరగతులు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించిన కౌన్సెలింగ్ గురువారం స్థానిక పిఎంఆర్‌సిలో నిర్వహించారు. 6వ తరగతిలో 50 సీట్లు ఉండగా, 250 మంది విద్యార్థులు, 7వ తరగతిలో 50 సీట్లుగాను 200 మంది, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 50 సీట్లుగాను 400 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఉదయం 8 గంటల నుండి రాత్రి వరకు ఈ కౌన్సెలింగ్ కొనసాగింది. ఎటపాక, చింతూరు, కూనవరం వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు కౌన్సెలింగ్‌కు వచ్చారు. అయితే ఐటిడిఎ అధికారులు వారికి ఎటువంటి భోజన, వసతి సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మరో వైపు కౌన్సెలింగ్‌కు సంబంధించి సరైన సమాచారం ఇవ్వలేదని, తక్కువ సీట్లు ఉంటే అందరినీ పిలిచి ఇబ్బందులకు గురి చేశారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.


వాలీబాల్ కిట్లు అందజేస్తున్న నేను సైతం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్

వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాజేంద్రపాలెం, కొయ్యూరు గ్రామాల యువకులకు వాలీబాల్ కిట్లను ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరి యువత మానసిక, శారీరకంగా దృఢంగా, ఉండి చెడు వ్యసనాలకు బానిసవకుండా ఉండేందుకే వాలీబాల్ కిట్లును అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆదేశాల మేరకు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు నియోజకవర్గాల వారీగా 200 వాలీబాల్ కిట్లను అందజేసినట్లు తెలిపారు. వాలీబాల్ కిట్ అవసరమైన వారు తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ నర్సి కిరణ్, యువకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది, స్థానికులు

మొక్కల నాటివేత

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ గురువారం చేపట్టింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుందరం చింతపల్లి క్యాంపు గ్రామ పరిసరాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పచ్చదనంతో పాటు పర్యావరణానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి ముంగిళ్ళ చెట్లు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

మెగా మెడికల్ క్యాంపు వాయిదా

ప్రజాశక్తి-కొయ్యూరు : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలకజీడి గ్రామంలో ఈనెల 7న జరగాల్సిన మెగా మెడికల్ క్యాంపు, వాలీబాల్ టోర్నమెంట్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కొయ్యూరు సీఐ ఎ.స్వామినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. మెగా మెడికల్ క్యాంపు, వాలీబాల్ టోర్నమెంట్ మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని ఎం.మాకవరం పంచాయతీ నడింపాలెం, చింతలపూడి పంచాయతీ గింజర్తి గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి గురువారం గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు కోడా చిన్నతల్లి, సెగే రమాదేవి, ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీటీసీ పొడుగు, రత్నం, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, వైసిపి నాయకులు సుధాకర్, నాగమణి కొయ్యూరు మండల అధ్యక్షులు జల్లి బాబులు, ముసలి నాయుడు, పొట్టక పోతురాజు, గాడి సత్తిబాబు, వనం బాబు, ధూపం శ్రీను, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కుక్కలకు ఎఆర్‌వి వేస్తున్న డాక్టర్ చరణ్

కుక్కలకు రేబిస్ టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి -హుకుంపేట: పెంపుడు జంతువులపై యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ డికె.చరణ్ అన్నారు. గురువారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో మూడు నెలలవయస్సు పైబడిన 16 పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జంతువుల నుంచి మనుష్యులకు సంక్రమించే వ్యాధుల నుంచి రక్షణకు ఈ వ్యాక్సినేషన్ ఎంతో అవసరమన్నారు. పెంపుడు కుక్కలకు ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. జంతువుల పెంపకం, యాజమాన్యంపై పెంపకందారులకు అవగాహన కల్పించారు.

అనంతగిరి : ప్రపంచ జూనోసిస్ దినం పురస్కరించుకొని గురువారం కాశీపట్న ప శువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు డాక్టర్ గణేశ్వరరావు తెలిపారు. వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెంపకందారులకు వివరించారు. అరకువేలీ ప్రాంతీయ పశువైద్యశాలలో వెటర్నరీ ఎడి డాక్టర్ నరసింహులు, అనంతగిరి, డుంబ్రిగుడ, కించుమండ పశువైద్యధికారులు. డాక్టర్ సందీప్, డాక్టర్ గౌతమ్, డాక్టర్.రాజశ్రీ . సిబ్బంది పాల్గున్నారు

బదిలీ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలో గలగండ పంచాయతీ కుతంగిపుట్టు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేసి బదిలీపై వెళుతున్న జంపరంగి లలిత శంకరం మాస్టారును గురువారం ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం కొరవంగి సంజీవరావు అధ్యక్షతన పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సభలో తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు, స్థానికులు సత్కరించి, వీడ్కోలు పలికారు. పదేళ్లకు పైగా కుతంగిపుట్టు పాఠశాలలో పనిచేసి, పాఠశాల, గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. పాఠశాలలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు చొరవ చూపారని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన బోధన చేసి వారిని తీర్చిదిద్దారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు, పిఎంసి కమిటీ చైర్మన్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణపై ఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి -పాడేరు : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు తీరును మండల విద్యాశాఖ అధికారి ఎస్ రామచంద్రరావు గురువారం పరిశీలించారు. పాత పాడేరు పాఠశాలను సందర్శించి. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పాఠశాలలో, నాడు నేడు పనుల ప్రగతిని పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు పరిశీలించి, .విద్యార్థుల బయోమెట్రిక్ నమోదులో తగు సలహాలు చేశారు.ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, నోట్ బుక్, వర్క్ బుక్ దిద్దుటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మధ్యాహన భోజనం అమలులో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. జగనన్న విద్యా కానుక పంపిణీ పూర్తిచేయాలని సూచించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు.

నేటి నుంచి బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి- పిఎం పాలెం : మధురవాడ చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో 10వ వైఎస్ఆర్ కప్-2023 జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు మారుతి బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్ తెలిపారు. పాఠశాల వద్ద గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మధురవాడలో పదేళ్లగా తమ క్లబ్ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు దల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాతసత్యనారాయణ, తైక్వాండో కోచ్ బి.ఆనందరావు, బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు దండు నాగేశ్వరరావు, కె.నూకరాజు, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ భూషణరావు, వైసిపి నాయకులు పోతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన ఎంఇఒకు యుటిఎఫ్ అభినందన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: డుంబ్రిగుడ మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శెట్టి సుందరరావను యుటిఎఫ్ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎంఇఒను కలిసిన యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. దీనిపై ఎంఇఒ సుందరరావు సానుకూలంగా స్పందించి, విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేయాలని కోరారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా కౌన్సిలర్లు ఎస్ కన్నయ్య, ఎం సత్యనారాయణ, మండల నాయకులు ఎల్‌బి దుక్కు, శ్రవణ్‌కుమార్, మల్లికార్జున్, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూతన ఎంఇఒను అభినందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఎంఇఒకు సత్కారం

ఎంఇఒగా విధుల్లో చేరిన శెట్టి సుందరరావును మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు ధర్మ, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.ఉపాధ్యాయులు సంజీవరావు, శ్రీరాములు ఉన్నారు.

10, 11 తేదీల్లో అంగన్వాడీల నిరసన దీక్ష



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ నేతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఈనెల 10,11 తేదీలో అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టే 36గంటల నిరసన జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పాంగి వెంకటలక్ష్మి కోరారు. గురువారం అరకువేలి ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమయ్యారని, తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు ఇస్తామని హామీని అటకెక్కించారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ తగ్గించి, పథకాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు మినీ కార్యకర్తలులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు వంజన, భవాని, సీత, లలిత పాల్గొన్నారు.

స్మార్ట్ నానో టెక్నాలజీతో జీవన ప్రమాణాల పెంపు

గీతం వైస్ ఛాన్స్‌లర్ దయానంద సిద్ధవట్టం

ప్రజాశక్తి-మధురవాడ : స్మార్ట్ నానో టెక్నాలజీతో మానవ జీవన ప్రమాణాలు పెంచడానికి పరిశోధకులు కృషి చేయాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం పిలుపునిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం, ఖతార్‌లోని ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్మార్ట్ నానోటెక్నాలజీస్ అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణం, వైద్యరంగం, శక్తి ఉత్పాదక రంగాలలో నానోటెక్నాలజీ కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధికి, సహజ వనురులను పొదుపుగా వినియోగించడానికి నానోటెక్నాలజీ పరిశోధనలు దోహద పడాలన్నారు. గీతం ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ అంతర్ విభాగ పరిశోధనలను ప్రోత్సహించడానికి గీతం ప్రాధాన్యత ఇస్తోందని దీనికోసం కోట్ల రూపాయల వ్యయంతో ప్రయోగశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. పరిశోధనల ఫలితాలు సమాజానికి, మానవ ప్రగతికి ఉపయోగపడాలన్నారు. దక్షణ కొరియా ఇన్హవిశ్వవిద్యాలయం క్రియేటివ్ రీసెర్చ్ సెంటర్ డైరక్టర్ ప్రొఫెసర్ జోవాన్ కిమ్ మాట్లాడుతూ, భారత్ కొరియా దేశాల మధ్య విద్యావేత్తలు సంయుక్త పరిశోధనలకు ముందుకు రావాలని సూచించారు. కొరియాలోని నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ భారతీయ పరిశోధకులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నానోసెల్యులోజ్‌తో తయారయ్యే వివిధ రకాల ఉత్పత్తుల ప్రయోజనాలను ఆయన వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ నానోటెక్నాలజీ ప్రపంచ వ్యాప్తంగా నూతన ఆవిష్కరణలకు మార్గం చూపుతోందని దీనిపై పరిశోధకులు దృష్టి సాధిచాలన్నారు. గీతం రసాయన శాస్త్ర విభాగం పరిశోధనలను విభాగం అధిపతి ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు వివరించారు. సదస్సు కో కన్వీనర్ ప్రొఫెసర్ అనీమా దధిచి మాట్లాడుతూ, ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 50 మందికి పైగా శాస్త్రవేత్తలు ఈ అంతర్జాతీయ సదస్సుకు హాజరు అయ్యారని తెలిపారు. సదస్సులో బయోమెటీరియల్స్, సోలార్ సెల్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, హైడ్రోజన్ ప్రొడక్షన్, స్మార్ట్‌నానో సెన్సార్స్, టిస్యూ ఇంజనీరింగ్, త్రిడి, 4డి ప్రింటింగ్, హైటెక్ డివైజస్, ఇనార్గానిక్, సాఫ్ట్‌మెటీరియల్స్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, ఖతార్ విశ్వవిద్యాలయం పరిశోధకులు, సదస్సు కన్వీనర్లు డాక్టర్ ఎస్.కిషోర్‌కుమార్, డాక్టర్ దీపలక్ష్మీపొన్నమ్మ, మలేషియాకు చెందిన మారాటెక్నాలజీ విశ్వవిద్యాలయం పరిశోధకులు డాక్టర్ మహ్మద్ ముజామీర్ మహత్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

15 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండల కేంద్రంలో స్థానిక సిఐ సత్యనారాయణ ఆదేశాల మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. బైకుపై మూటతో వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా, మూటలో 15 కేజీల గంజాయి బయటపడింది. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఎఎస్ఐ చిట్టిబాబు ఆధ్వర్యంలో విచారించగా, బుచ్చయ్యపేట మండలం గొర్లిపాలెం గ్రామానికి చెందిన కట్ట కులాసరావుగా గుర్తించారు. నిందితుని అదుపులోకి తీసుకుని, గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు , ఎస్ఐ సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ ఆనందరావు కానిస్టేబుల్స్ చినబాబు, సత్యారావు పాల్గొన్నారు

ప్రజల వద్దకే సంక్షేమం లక్ష్యం


ప్రజాశక్తి- అనంతగిరి : ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపిపి శెట్టి నీలవేణి తెలిపారు. గురువారం గుమ్మకోట పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ పాంగి అప్పారావు అధ్యక్షతన జగనన్న సురక్షలో పాల్గొని, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 11రకాల ధ్రువీకరణలను ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా అందజేస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 1553 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. కులం. ఆదాయం, ఆధార, రేషన్ కార్డు, భూమి వ్యవహారాలు తదితర సమస్యలను కార్యదర్శి భేగం సహకారంతో పూర్తి చేశామన్నారు. సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ, లబ్ధిదారుల సమక్షంలోనే సమగ్ర భూసర్వే నిర్వహించాలని కోరారు. ఎస్ఐ రాము మాట్లాడుతూ, భూవివాదాలు, ఆధార్ సాయంతో ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపుల్లో జాగ్రత్త వహించాలని సూచించారు కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి, మండల ప్రత్యేకాధికారి సుర్యలక్ష్మి, తహశీల్దార్ రాంబాయి. అరకులోయ సిఐ రుద్రశేఖర్. మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు స్వామి. గుమ్మకోట ఎంపిటిసి తౌడునాయుడు, కోఆప్షన్ సభ్యుడు షేక్‌మదీనా, ఇఒపిఆర్‌డి, ఆర్ఐ లక్ష్మీకాంత్, విఆర్ఒ కోటిబాబు పాల్గొన్నారు.

జర్మనీలో 34 వేల మంది భారతీయ విద్యార్థులు

ప్రజాశక్తి-మధురవాడ : జర్మనీలో ఉన్నత విద్యాభ్యాసానికి వస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమేపి పెరుగుతోందని తాజా గణాంకాల ప్రకారం 34 వేల మంది జర్మనీ విశ్వవిద్యాలయాలలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని, చైనా తరువాత అత్యధిక సంఖ్యలో ఉన్నది భారతీయ విద్యార్థులే అని జర్మనీ కాన్సులేట్ జనరల్ మిఛెల్లా కుచ్‌లర్ వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని గురువారం సందర్శించిన అమె వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం ఇతర అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత్ జర్మనీ దేశాల మధ్య సుదీర్ఘకాలం నుంచి బలమైన సంబంధాలు ఉన్నాయని, ముఖ్యంగా ప్రభుత్వాల మధ్య సాంకేతిక రంగంలో ద్వైపాక్షిక ఒప్పందాలు, పరస్పర సహకారం కొనసాగుతున్నాయని తెలిపారు. జర్మనీ విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లు భారతీయ విశ్వవిద్యాలయాలను సందర్శించడం బోధన, పరిశోధనలలో పాలు పంచుకోవడం జరుగుతోందన్నారు. జర్మనీలో విద్యాభ్యాసం చేయడానికి ముందుకు వచ్చేవారు కొద్దిపాటి జర్మన్ భాషను తెలుసుకొని ఉండటం స్థానికంగా నివశించడానికి ఉపయోగపడుతుందన్నారు. జర్మనీలో ఉన్నత విద్య పూర్తి చేశాక స్థానికంగా ఉద్యోగ ప్రయత్నం చేయడానికి 18 నెలల గడువు ఇస్తామని తెలిపారు. భారతీయ విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్ వివరాల కోసం తమ వెబ్‌సైట్ చూడవచ్చన్నారు. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధికారులు డాక్టర్ ఉమాదేవి, శ్రీరామ్, అదర్ కెరీర్ ఆప్షన్స్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.రవికాంత్ తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశనిర్దేశం చేశారు. జర్మన్ కాన్సులేట్ చెన్నై కార్యాలయం అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, ప్రోవైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జయశంకర్‌వారియర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, రీసెర్చి విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ రాజాపప్పు తదితరులు పాల్గొన్నారు.

దంత కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో ఈ నెల 3, 4 తేదీల్లో ముంబైకి చెందిన ఐకెఎస్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ప్రాంగణ ఎంపికలకు హాజరైన 48 మంది విద్యార్థులకు 26 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అనిల్ నీరుకొండ ఎడ్యుకేషనల్ సొసైటీ సిఇఒ నిరంజన్ కుమార్ కళాశాలలో అభినందించారు.



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం ఎం.మాకవరం గ్రామానికి చెందిన సాంబెల్లి సాయి బుధవారం విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సాయి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోడా చింతల్లి, సెగ్గె రమాదేవి, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, ఎఎంసీ ఛైర్మన్ జైతి రాజులమ్మ, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, వైసిపి నాయకులు జల్లి బాబులు, బండి సుధాకర్, గాడి సత్యనారాయణ, ఎంపిటిసి పొదుగు రత్నం, బిరిజన అప్పారావు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.



అన్న సమారాధన నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ఆధ్వర్యాన అన్న సమారాధన

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు, మంప పోలీసుల ఆధ్వర్యంలో ఏపీఎస్పీ ఆర్ఐ బి.బాలకృష్ణ చౌదరి సింగవరం షిరిడీ బాబా ఆలయంలో గురువారం విశేష అన్న సమారాధన నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కొయ్యూరు సిఐ సాయి కొయ్యూరు, మంప ఎస్సైలు రాజారావు, లోకేష్ కుమార్ భక్తులకు స్వయంగా వడ్డన చేశారు. ముందుగా బాబా ఆలయంలో హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్న సమారాధనకు సుమారు 400 మంది హాజరయ్యారు.

ఎవికె కాలేజీ మూసివేతపై ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాజువాకలోని ఎవికె న్యూస్ డిగ్రీ కాలేజీ యాజమాన్యం అర్ధాంతరంగా కాలేజీని మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రా యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎల్జె.నాయుడు మాట్లాడుతూ ఎవికె న్యూస్ డిగ్రీ కాలేజీ యాజమాన్యం కాలేజీలో చదువుతున్న 400 మంది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోందన్నారు. లాభాలు రావడం లేదని, వేరే వ్యాపారం తమకు ఉన్నాయని చెబుతూ కాలేజీ మూసివేసి తెగబడడం దారుణమన్నారు. ఇష్టానుసారం ఫీజులు వసూలు చేసుకుని, సెమిస్టర్ పరీక్షలు దగ్గరపడుతున్న తరుణంలో విద్యార్థులకు క్లాసులు నిర్వహించకుండా, ల్యాబ్ వర్క్ జరపకుండా నెలల తరబడి నెట్టుకొచ్చి నేడు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడం సరికాదన్నారు. విద్యార్థులు చదువు పూర్తయ్యే వరకూ కాలేజీని నిర్వహించాలన్నారు. అనంతరం ఎయు సిడిసి డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు.

భూ సమగ్ర సర్వేకు ఆటంకాలు

వెంటాడుతున్న మిషన్ల కొరత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో / ఆనందపురం

విశాఖ జిల్లాలో జరుగుతున్న భూ సమగ్ర సర్వే పలుచోట్ల ఆటంకాలు నడుమ మందకొడిగా సాగుతోంది. విశాఖలో పదుల సంఖ్యలో గ్రామాల్లో ఈ సమగ్ర సర్వే నిలిచిపోయింది. మూడు విడతల్లో భూముల సర్వే జరగాల్సి ఉండగా మిషన్లు లేకపోవడం ఒక సమస్యగా కనిపిస్తోంది. భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో కొన్నిచోట్ల మందకొడిగా నడుస్తోంది. ఆనందపురం మండలంలోని 26 గ్రామ పంచాయతీలు, 18 సచివాలయాల్లో సమగ్ర భూ సర్వే పనులు చేపట్టారు. దీనిలో భాగంగా 12 గ్రామాల్లో సర్వే పనులు పూర్తయ్యాయని తహశీల్దారు రామారావు తెలిపారు. పూర్తయిన సచివాలయాల పరిధిలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. మిగిలిన పంచాయతీలలో సర్వే పూర్తికాకపోవడం వల్ల గ్రామ సచివాలయాల్లో పలు పనులు ప్రారంభం కాక రైతులు అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీలోనే రిజిస్ట్రేషన్‌ల కోసం ఎదురు చూస్తున్న ప్రజానీకం ఈ సర్వేలో జరుగుతోన్న ఆలస్యంతో అవస్థలు పడుతున్నారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కుసులవాడలో సర్వే ఎందుకు ఆగింది ?

ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలో జరగాల్సిన సమగ్ర భూ సర్వే వారం రోజులుగా ఆటంకాలను ఎదుర్కొంటోంది. ప్రారంభమే తరువాయి సర్వే నిలిచిపోవడానికి భూవివాదాలు కూడా కారణంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ పంచాయతీలో 42 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేసి కొంత మేర ముందుకెళ్లింది. అక్కడ కొంతమంది రైతులు ల్యాండ్ పూలింగ్‌కి వ్యతిరేకంగా ఉన్నారు. సమగ్ర భూ సర్వేకు కూడా ఈ కారణం వల్లనే అడ్డుతగలడంతో ఆగిందన్న ప్రచారం జరుగుతోంది. అధికారులు కూడా ఇక్కడ సర్వేను అర్ధాంతరంగా నిలిపివేసినట్లు వెల్లడించారు.

తహశీల్దార్ ఏమన్నారంటే..

స్థానిక తహశీల్దార్ రామారావు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కుసులవాడ, ఆనందపురంలో సమగ్ర భూ సర్వే నిలిపివేతకు భూ సమస్యలు కారణం కాదని, మ్యాప్‌లు, సామగ్రి సమకూరినప్పటికీ మిషన్ల కొరత కారణంగానే సర్వేను వాయిదా వేశామని తెలిపారు. మరో ఐదు రోజుల్లో సర్వే చేపడతామని వెల్లడించారు.



హాస్టల్ విద్యార్థులతో ఎస్ఐ రామకృష్ణ

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - సీలేరు : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అవరోధించాలంటే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణ అన్నారు. జీకే వీధి మండలం సీలేరు యుసిఐఎం హాస్టిల్‌ను గురువారం ఉదయం ఆయన సందర్శించి, విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు సంఘ విద్రోహ శక్తులతో చేతులు కలపరాదని, చెడు వ్యసనాలకి బానిసలు కావద్దని హితవుపలికారు. ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎ ఇంటర్ ఫలితాల్లో సిపిఐ సిఎ అకాడమీ ప్రతిభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఐసిఎఐ బుధవారం విడుదల చేసిన సిఎ ఇంటర్ ఫలితాలలో సిపిఇ సిఎ అకాడమీ ఆల్ ఇండియా స్థాయిలో 36వ ర్యాంకు సాధించిందని అకాడమీ సిఇఒ బి.ఆదినారాయణ తెలిపారు. గురువారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అకాడమీలో ఇంటర్మీడియట్ ఎంఇసితో పాటు సిఎ చదువుతున్న ఎస్.మణి సహారా 610 మార్కులతో ఆల్ ఇండియా 36వ ర్యాంకు సాధించడం తమ అకాడమీకి గర్వకారణమన్నారు. ప్రణాళికాబద్ధమైన బోధన, రెగ్యులర్ పరీక్షల నిర్వహణనే ఉత్తమ ఫలితాలకు కారణమన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులు చేస్తున్న తప్పులను సరిదిద్దుతూ, వారి సందేహాలను నివృత్తి చేసి వారిని ప్రోత్సహించడం వల్ల మంచి ర్యాంకులు దక్కాయన్నారు. 65 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 18 మంది రెండు గ్రూపులు, 16 మంది ఒక గ్రూపులో ఉత్తీర్ణత చెంది అద్భుత విజయాన్ని అందించారని చెప్పారు. విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను అభినందించారు. 36వ ర్యాంక్ సాధించిన విద్యార్థి మణి సహారా మాట్లాడుతూ తాను చదువుకున్న సంస్థలో విద్యాబోధన అన్ని విధాలా బాగున్నందునే తాను విజయం సాధించానని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపాల్ పిఎన్‌వి.ప్రసాద్, డైరెక్టర్లు సుధీర్, రామచంద్రం పాల్గొన్నారు.

23న ఉత్తమ విద్యార్థుల అభినందన సభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యా రంగంలో వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచి అధికంగా మార్కులు సాధించిన గవర విద్యార్థులకు ఈ నెల 23న కంచరపాలెం రైల్వే ఆశీర్వాద కల్యాణ మండపంలో 'ఉత్తమ విద్యార్థినీ, విద్యార్థుల అభినందన సభ - 2023' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర గౌరీ గవర సేవా సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ తెలిపారు. గురువారం కేంద్ర గౌరీ సేవా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గవర విద్యార్థులను విద్యలో ప్రోత్సహించే నిమిత్తం వారికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి సత్కరించనున్నట్టు తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో చదువుకున్న 10వ తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్ అన్ని గ్రూపుల వారికి, పాలిటెక్నిక్ - 2023 ఎంట్రన్స్, ఎపి సెట్-2023 ఇంజినీరింగ్ మెడికల్, ఐఐటి - 2023, గేట్-2023, ఐసిఇటి, ఇసిఇటి, ఎఐఇఇఇ, ఎయు సెట్, లా సెట్, ఎపి ఆర్‌జెసి, పిజి సెట్, పిహెచ్‌డి, నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్ వచ్చిన వారికి ఈ పథకంలో అర్హత కల్పించినట్లు తెలిపారు. గవర విద్యార్థులు అవార్డు కోసం ఈ నెల 15లోగా వారి దరఖాస్తులను విశాఖ రైల్వే న్యూ కాలనీ, తాటి చెట్లపాలెం కేంద్ర గౌరీ గవర సేవా సంఘం కార్యాలయంలో అందించాలని కోరారు. గౌరీ సంఘ ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు, కోశాధికారి కొణతాల వరాహ కోటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పెంటకోట సంజీవరావు నాయుడు, మల్ల శంకరరావు, పీలా ప్రసాద్, శరగడం సత్యనారాయణ, వేగి సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత లాలం భాస్కరరావు మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, రాంబిల్లి, అచ్యుతాపురం విలేకరులు

టిడిపి సీనియర్ నేత, ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి లాలం భాస్కరరావు (70) గురువారం గుండె జబ్బుతో విశాఖ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందారు. యలమంచిలి నియోజవర్గం రాంబిల్లి మండలం లాలంకోడూరుకు చెందిన భాస్కరరావు టిడిపి తరపున రాంబిల్లి ఎంపిపిగా, జెడ్‌పిటిసిగా పనిచేశారు. యలమంచిలి నియోజవర్గ ఇన్‌ఛార్జిగానూ వ్యవహరించారు. 2009లో యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆయన భార్య లాలం భవాని విశాఖపట్నం జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్‌గా ఐదేళ్లపాటు పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భాస్కరరావు పార్థివదేహాన్ని టిడిపి విశాఖ జిల్లా కార్యాలయానికి తీసుకురాగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, తదితరులు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు.



భాస్కరరావు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్



భాస్కరరావు (ఫైల్‌ఫొటో)

లాలం కోడూరులో విషాదఛాయలు

భాస్కరరావు మృతితో స్వగ్రామమైన లాలంకోడూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. భాస్కరరావు మరణవార్త తెలుసుకున్న వెంటనే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, భీమిలి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, తదితరులు లాలం కోడూరు తరలివచ్చి భాస్కరరావు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. భాస్కరరావు అంత్యక్రియలను శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.